# కెరటాలు

అది పచ్చదనపు ప్రకృతి అందాలతో, పక్షుల కిలకిలారావాలతో, పసిడి పంటల ధగధగలతో, పవిత్ర గోదావరీ నిత్య స్పర్శతో యావదాంధ్రదేశానికీ మణికిరీటమయిన సీమ, అందాల కోనసీమ. ఆ కోనసీమ అంచులలో, వృద్ధగౌతమీ నది పొత్తిళ్ళలో, ప్రశాంతమయిన వాతావరణంలో కొలువైన చిన్న గ్రామమే వేదిభట్లవారి అగ్రహారం. ఆ అగ్రహారం కుశాగ్రబుద్ధులతో, బహుశాస్త్రపారంగతులతో, ప్రాజ్ఞవరేణ్యులతో నిండిన యాభై కుటుంబముల సమాహారం. ఆ అగ్రహారానికి పెద్ద దిక్కు భాస్కరశాస్త్రులవారు. ఆయన అపర కౌటిల్యునిగా పేరుగాంచిన మహానుభావులు. వేదశాస్త్రములలో దిట్ట. పంచముఖీ వీరాంజనేయుని ఉపాసనాపరుడు. పదిహేను మంది సభ్యులతో నిండుకుండలా ఉండే వారి ఉమ్మడి కుటుంబం నిత్యం వారి అదుపాజ్ఞలలో ఉండేది. భాస్కరశాస్త్రులవారి పెద్దకుమారుడు వేంకటేశ్వరులవారు. వారు శ్రీకృష్ణభగవానుని మహాభక్తులు. వ్యాకరణంలో దిట్ట. త్రిలింగ కథనంలో, కవనంలో సిద్ధహస్తులు. మంచి వాక్పటిమ కలిగిన ఉపన్యాసకులు. అన్నింటికీ మించి సామాజిక స్పృహ కలిగిన మంచి వ్యక్తి. వారి రెండవ సంతానమే శ్రీకృష్ణశాస్త్రులవారు. ఆయన జన్మించిన రోజు అగ్రహారం మొత్తం ఆనందోత్సాహాలలో మునిగితేలింది. వారి జన్మఘడియల ప్రభావం యావదగ్రహారానికి మేలు చేయనున్నదనే నమ్మకమే వారి అనందానికి మూలకారణం. ముద్దులు మూటకడుతున్న ఆ చిన్నారిని చూసి "అచ్చం తాతగారి పోలికే" అంటూ అంతా ఎంతగానో మురిసిపోయారు. "తాతగారి వలెనే బహుముఖ ప్రజ్ఞాశాలివి కావాలి" అని అందరూ మనస్ఫూర్తిగా శిశువుని ఆశీర్వదించారు.

పుట్టిననాటినుండీ అందరి ఆకర్షణకు కేంద్ర బిందువై పెరిగిన శ్రీకృష్ణశాస్త్రులవారికి రెండవ సంవత్సరం వచ్చిన తరువాత అక్షరాభ్యాసం చేయనిశ్చయించారు భాస్కరశాస్త్రులవారు. వాసరాపీఠనిలయ అయిన మహాసరస్వతిని ప్రతిష్ఠించి, వేదమంత్రాలతో సంప్రోక్షణ గావించి, అత్యంత శుభలగ్నములో, వేదపండితుల ఆశీస్సుల నడుమ, అగ్రహారవాసుల హర్షాతిరేకాల నడుమ శ్రీకృష్ణశాస్త్రులవారి అక్షరాభ్యాస మహోత్సవం రంగరంగ వైభవంగా జరిగింది. అందరి అభిప్రాయాలకు అనుగుణంగానే కృష్ణశాస్త్రులవారి విద్యాభ్యాసం నల్లేరు మీద బండి నడకలా సాగింది. బాలశిక్షను అధ్యయనం చేయడంతో మొదలైన శాస్త్రులవారి అభ్యాసం వ్యాకరణ ఛందస్సుల గంధాలతో మెరుగులు దిద్దుకుని, వాణీ కటాక్షమైన ఏకసంధాగ్రాహ్యత ఆసరాతో వేదశాస్త్రాల అధ్యయనానికి రంగం సిద్ధం చేసుకునేవరకు ఎటువంటి అడ్డంకులూ లేకుండా కొనసాగింది. ఉపనయనం చేయనిదే వేదాధ్యయనం ఆరంభించడం మంచిదికాదని భాస్కరశాస్త్రులవారు నమ్ముటచే కృష్ణశాస్త్రులవారికి త్వరలోనే ఉపనయనం చేయవలెనని నిశ్చయించినారు. కానీ, ఈలోపు వేంకటేశ్వరులవారికి సమీపంలోని పట్టణంలో అధ్యాపక వృత్తిని చేపట్టవల్సినదిగా ఒక విన్నపము వచ్చినది. విశాలదృక్పథం కలిగినవారగుటచే ఆ వృత్తిని చేపట్టుటకే వేంకటేశ్వరులవారు నిశ్చయించుకొనినారు. కనుక మకాం మార్చడం అనివార్యమైనది. కృష్ణశాస్త్రులవారిని విడిచిపెట్టి ఉండలేని భాస్కరశాస్త్రులవారు ఎంతగానో మథనపడినారు. కానీ కుమారుడిని అపుటకు సరియైన కారణం కనిపించక తన భావములను మనసులోనే అణచుకొనినారు. ఇక కృష్ణశాస్త్రులవారి వేదన వర్ణనాతీతము. పట్నవాసం ఎలా

ఉంటుందోననే భయముతో, సన్నిహితులను విడిచి వెళ్ళవలెననే వేదనతో, తాతగారి ప్రేమాభిమానములకు దూరమగుచున్నాననే బాధతో కృష్ణశాస్త్రులవారు నరకయాతన అనుభవించినారు. సమయం సరిపడినంత లేకపోవుటచే కృష్ణశాస్త్రులవారి ఉపనయనోత్సవం వాయిదా పడినది. వేదశాస్త్రములను అధ్యయనం చేయలేకపోవుచున్నాననే బాధతో మౌనంగా కూర్చొని ఉన్న కృష్ణశాస్త్రులవారిని దగ్గరకు పిలిచి, అక్కున చేర్చుకుని భాస్కరశాస్త్రులవారు ఇలా ఉపదేశించినారు-

"నాయనా, కృష్ణా! యుక్తాయుక్త విచక్షణకై వేదశాస్త్రములే నీకు ప్రమాణము. అయినప్పటికీ వాటిని అధ్యయనం చేయలేకపోయినందుకు నీవేమీ బాధపడనవసరంలేదు. నీకొక ముఖ్యమయిన విషయం చెబుతాను, విను. చిదానందుడయిన శ్రీకృష్ణభగవానుడు స్వయముగా చెప్పిన శాస్త్రము, వ్యాసభగవానునిచే విరచితము అయిన యోగశాస్త్రమే శ్రీమద్భగవద్గీత. అదియే ఉపనిషత్తుల సారము, వేదవేదాంగముల తాత్పర్యము. కనుక నీ జీవన శైలిని చక్కదిద్దుకొనుటకు, సంఘంలో గొప్పవ్యక్తిగా నిలుచుటకు ఆ శాస్త్రమును అధ్యయనం చేయి నాయనా, శుభం భూయాత్!"

ఇదంతా విన్న కృష్ణశాస్త్రులవారికి శ్రీమద్భగవద్గీతని అధ్యయనం చేయమని తాతగారు సూచించినారని అర్థమైనది కానీ, జీవనశైలిని చక్కదిద్దుకొనుట అనగా ఏమిటి, అందుకు ఆ గ్రంథము ఏ రకముగా తోడ్పడగలదు వంటి విషయములు అర్థం కాలేదు. ఆ సందేహములతోటే నాన్నగారి వెంట పట్నమునకు చేరుకున్నారు కృష్ణశాస్త్రులవారు.

ముందుగా శంకించిన విధముగనే పట్నవాసము, అక్కడి సంస్కృతి, ప్రజల ఆచార శైలి - ఇవేమీ కృష్ణశాస్త్రులవారికి రుచించలేదు. అక్కడి ఓ ప్రభుత్వ పాఠశాలలో చేరిన కృష్ణశాస్త్రులవారు తోటి విద్యార్థులతో సరిగా మెలగలేకపోయేవారు. ఎవరినీ సన్నిహితులుగా భావించలేకపోయేవారు. కానీ ఇవేమీ వారి విద్యాభ్యాసమునకు అడ్డు కాలేకపోయినాయి. సహజంగానే ఏకసంథాగ్రాహి అయిన శాస్త్రులవారికి సాధారణ పాఠ్యాంశాలు అత్యంత సులభముగా తోచేవి. ప్రతీ పరీక్షలోనూ వారే మొదటి స్థానంలో నిలిచేవారు. పాఠ్యేతర అంశములయిన వ్యాసరచన, వక్తృత్వం వంటి పోటీలలో కూడా తనదయిన ప్రతిభని కనబరిచేవారు. తాతగారు అప్పగించిన భాధ్యత అయిన భగవద్గీతాధ్యయనాన్ని పూర్తి చేయగలిగినారు. గీతలోని శ్లోకాలన్నిటినీ భట్టియంవేయగలిగినారు. అలా అన్నింటిలోనూ ముందంజలో ఉన్న శాస్త్రులవారు సహజంగానే అందరి దృష్టిని ఆకర్షించగలిగేవారు. కానీ ఎన్ని సంవత్సరములు గడిచినా తన వ్యక్తిత్వానికి ఒక రూపం ఇవ్వలేకపోయారు. తోటిపిల్లలవలే ప్రవర్తించలేకపోయేవారు. వింత వ్యక్తిత్వానికి, విపరీత మనస్తత్వానికి చిరునామా అయినారు.

కాలగమనంలో సంవత్సరములు గతించిపోయినాయి. శ్రీకృష్ణశాస్త్రులవారు శ్రీకృష్ణగా మారినారు. ఉంటున్న ఊరికి కొన్ని వందల మైళ్ళ దూరంలో కల నగరంలోని ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశం పొందినారు. తల్లిదండ్రులనీ, తోబుట్టువులనీ అందరినీ వదిలి నగరానికి చేరుకున్నారు.

అక్కడి వాతావరణం, విభిన్న ప్రాంతములకు చెందిన తోటి విద్యార్థుల ఆచార వ్యవహారములు,

వారి మాటల శైలి - ఇలా అన్నింటిలోనూ తన మనసు ఏదో లోపాన్ని ఎంచి చూపుతూ ఉండుటచే శ్రీకృష్ణ నిత్యం ఎంతో మానసిక సంఘర్షణకి గురయ్యేవాడు. తన నడవడిని, ప్రవర్తనని నిత్యం జాగ్రత్తగా గమనించి, మంచి చెడ్డలను వివరించి, ఆకలి దప్పులలోను, నిద్రా విహారములలోను తన వెంటే ఉంటూ, తనని తానుగా ప్రేమించి, అభిమానించి, ఆదరించే మనసున్న మనిషి కోసం, నిజమయిన స్నేహం కోసం సంవత్సరముల తరబడి పడిగాపులు పడి ఎదురు చూసి, కొండంత ఆశతో కొత్త ప్రదేశమునకు వచ్చిన తనకి కనిపించిన ఆ నిరాశాపూరిత వాతావరణమును చూసి శ్రీకృష్ణ ఎంతగానో కుమిలిపోయినారు. దొరకనిదానికోసం వెతుకుతూ, మనస్సుని నిత్యం మథనపరిచేకంటే, మనసనేది ఒక జలపాతమని, తనకు ప్రవేశము లేని మహాసముద్రమని భావించి, స్పందనలేని ఒక కటిక రాయి వలే, భావావేశములు లేని నల్లని పాషాణం వలే తనని తాను మార్చుకుని, హృదయంలో వాణీ మందిరమును నెలకొల్పి, ఆ తల్లి అనుగ్రహాక్షతలు శిరమున ధరియించి, శరీరమును ఒక యంత్రము వలే మార్చి, విద్యార్ధి దశకు పరిపూర్ణతను అందించి, అభిప్రాయ వ్యక్తీకరణలోనూ, అంచనాలకందని ఆలోచనల అల్లికలోనూ తనదైన ముద్రను చూపించుటకే నిర్ణయం తీసుకుని అడుగు ముందుకు వేసినాడు.

సంకల్పసిద్ధులకు, కర్తవ్య దీక్షాపరులకు, కార్యసిద్ధులకు సాధ్యంకానిదే మీలేదని మరియొకసారి రూఢి చేసేందుకు శ్రీకృష్ణ కంఠమున విజయ మాలలు వరుసగా వచ్చి చేరినాయి. తోటి విద్యార్ధులు చూసి ఈర్ష్య పడేంత ఉన్నత స్థితికి చేర్చినాయి. భారతదేశం గర్వించదగ్గ ఒక గొప్ప వ్యవస్థలో ఉద్యోగముతో, చుట్టపక్కాల ప్రశంసలతో, సాటి విద్యార్ధుల అభినందనలతో చుక్కల్లో చంద్రునిలా, మకుటంలేని మహారాజులా వెలుగొందుతూ ఉన్న తరుణంలో మరణించిందనుకొనిన శ్రీకృష్ణ మనస్సు మేల్కొనింది. అంతరించిపోయాయనుకొనిన అతని అందమయిన భావములు మరలా నిద్ర లేచినాయి. సప్తసముద్రముల అవతల, వేల యోజనముల లోతున, అంధకార అగాధములో, రాతిగొలుసులచే బంధింపబడి, చలనం లేక, శుష్కించి పడి ఉన్న మనసున్న మనిషిని నిద్ర లేపినాయి. మహా పర్వతముల మధ్యన చిన్ని ఊటలో నుండి ఉబికి పైకి వచ్చిన చిరువాగు, పర్వత అంచుల నుండి జాలువారుతూ, ప్రవాహమై, భీషణ గర్జనతో మహాజలపాతమై, నిరంతర ప్రవాహంతో మహానదియై, నిర్నిరోధగమనవేగముతో సముద్రంలో విలీనమై, ప్రపంచమును తల్లక్రిందులు చేయు ప్రళయాంతకారిగా రూపుదాల్చే తీరున, స్వచ్ఛమైన ప్రేమని, అందమైన స్పందనని కోరుకుంటున్న అతని మనసు నియంత వంటి అతని బాహ్య స్వరూపమును ముక్కలు చేసి, తనకి కావల్సినది అందించగలిగే శక్తికోసం శక్తికొలది ప్రయత్నించేలా పురికొల్పినది. కానీ, ఎంత యత్నించినా ఆ మనసున్న మనిషి కోరుకున్న స్పదించే మనసు మాత్రం కానరాలేదు. 'నన్ను ప్రేమించే మనసొకటి నాకు కావాలి' అని కొండ అంచున నిలబడి, భూమ్యకాశములు ప్రతిధ్వనించేలా, పాతాళం బ్రద్దలయేలా అతను చేసిన విజ్ఞప్తి, అతను వెలిబుచ్చిన అమాయకమయిన ఆశ గిరులు దాటి, సాగరులు చుట్టి, ప్రాకారములు దాటి, ఆకాశములు తాకి, తామరపూవుల కోనేరులలో, మంచునిండిన మహాసముద్రములలో అలజడిని సృష్టించినా, అతను మెచ్చే, అతని మనసుకి నచ్చే స్పందన మాత్రం కానరాలేదు. రాత్రింబవళ్ళూ, రోజుల తరబడి అంతులేకుండా కొనసాగిన ఆ అంతర్మథనానికి శ్రీకృష్ణ మానసికంగా పూర్తిగా నలిగిపోయాడు. సమస్త మానవాళి మనుగడకు ప్రామాణికమయిన శ్రీమద్భగవద్గీతని ఔపోసన పట్టిన శ్రీకృష్ణ పాండిత్యం కానీ,

కఠ, మండూక, శర ఉపనిషత్తుల సారాన్ని కాచి వడపోయుటవలన; రామాయణ, భారత, భాగవతాది ఉద్గ్రంథోక్తులను జీర్ణం చేసుకొనుటచే అబ్బిన అతని విచక్షణ కానీ కోరుకున్నది దక్కక, ఆశపడినది అందక, ఆత్మలోకంలో దివాళా తీసి అడుగుతీసి అడుగు ముందుకు వేయలేక, స్థాణువులా నిలిచిపోయి ఉన్న అతనిని ముందుకు నడిపించలేకపోయినాయి. యాంత్రికంగా బ్రతకుట ఎలాగో నేర్పలేకపోయినాయి. జరిగినది, జరుగుతున్నది, జరగబోయేది - వేటినీ జీర్ణించుకొలేకపోయిన శ్రీకృష్ణ తనలో కొనసాగుతోన్న ఆ అంతర్మథనానికి శాశ్వతముగా తెరవేయుటకే నిశ్చయించుకుని కలం చేతపట్టినాడు.

***************************************************

సమయం: జనవరి 21వ తేదీ, 2001వ సంవత్సరం, సాయంత్రం గం. 5:00 ని. లు.
స్థలం: అదే అందచందాల సీమ, బంగారు కోనసీమ. కానీ ఇప్పుడు ప్రకృతి ప్రసాదిత పరిమళాలూ లేవు, పక్షుల కిలకిలారావాలూ లేవు. సర్వత్రా నైరాశ్యం, స్మశాన నిశ్శబ్దం. వేదిభట్ల వారి అగ్రహారం యావత్తూ విచారంలో మునిగిపోయి ఉన్నది. పక్షవాతం బారినపడి ఉన్న భాస్కరశాస్త్రులవారు చేతికర్ర ఆసరాతో, విషణ్ణవదనంతో గోడకి ఆనుకొని నిలుచొని ఉన్నారు.

నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావకః
నచైనం క్లేదయం త్యాపో న శోషయతి మారుతః

అని బాగుగా తెలిసిన వారగుటచే వేంకటేశ్వరులవారు, వారి సహ కుటుంబీకులు మనసులోని అలజడిని తొక్కిపట్టగలిగినారు. శ్రీకృష్ణశాస్త్రులవారు మరణించి అప్పుడే సంవత్సరమైపోయినదనే నమ్మలేని నిజమును జీర్ణించుకోలేకపోయినప్పటికీ, కర్మబద్ధులగుటచే తమకి తామే కర్తవ్యబోధ చేసుకుని కృష్ణశాస్త్రులవారి ఆఖరి కోరికను తీర్చుటకు ఉద్యుక్తులయినారు. గౌతమీనది ఒడ్డున, ప్రశాంత వాతావరణములో, శాస్త్రులవారు ఉద్దేశించిన ప్రదేశములో, వారి చివరి పలుకులతో, వారు చెప్పిన రోజున స్మృతిచిహ్నమును ఏర్పరచగలిగినారు.

సూర్యతేజుడు, అబ్జనేత్రుడు, అంతు చిక్కని రూపం కలవాడు, అఖిల ప్రపంచమునకు ఆధారభూతుడు, అయిన ఆ పరమాత్మకి ముద్దుబిడ్డ అయిన శ్రీకృష్ణశాస్త్రులవారి మనసుపొరల ఆలాపనకు వాక్యరూపమే ఆ స్మృతిఫలకముపై నిలిచిపోయిన ఈ నిర్మాణం...

సాగరగర్భంలో నేనొక ఉదయించిన కెరటం
నింగికెగసి నిన్ను చేరాలన్నదే నా ఆరాటం
అందుకే సంద్రంతో నా ఈ అంతులేని పోరాటం

కానీ...

నా కలల అలలు ఎగసి ఎగసి అలసిసొలసి

తీరాన్ని చేరకనే ముక్కలయినది నా రూపం
అందలేదు ఆ అద్భుత ఆకాశం
తీరలేదు ఈ జన్మలో నా ఆశయం
అయినా తగ్గదు నేస్తం నా ఆవేశం
మరుజన్మనైనా నెగ్గుతాను మన కోసం!!!

నిన్ను కాదన్నది నా ప్రమాణములో, పరిస్థితులో కాదమ్మా, నా అవసరములు...అర్థం చేసుకుంటావు కదూ!

ఇంతకీ 'మన కోసం' అంటే ఎవరి కోసం? ఏమో, కృష్ణశాస్త్రుల వారికే తెలియాలి.